క్లుప్తంగా

హనుమంతరావు మృతి తీరనిలోటు

ధర్మసాగర్ : దేశినేని హనుమంతరావు మృతి తనకు తీరనిలోటని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విచారణ వ్యక్తం చేశారు. కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దేశినేని హనుమంతరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కడియం హనుమంతరావు మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 35 ఏళ్ల స్నేహబంధం నేటితో ముగిపోవడం తనను కలిచివేస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. రాజకీయ బంధం స్నేహ బంధంగా మారి, కుటుంబ బంధంగా ఎదిగి నిత్యం తోడుగా ఉండేవారని తెలిపారు. అనంతరం హనుమంతరావు కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అహల్యాబాయి సేవలు చిరస్మరణీయం



బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి

శాయంపేట : చేనేత కార్మికుల సంక్షేమం కోసం లోకమాత రాణి అహల్యాయి హోల్కర్ కృషి చేశారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాయరాకుల మొగిలి, పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ అన్నారు. అహల్యాభాయ్ హోల్కర్ జయంతిని శనివారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అహల్యాబాయి హోల్కర్ తన పాలనలో మహేశ్వర్‌ను చేనేత పరిశ్రమ కేంద్రంగా అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాసాని నవీన్, కోమటి రాజశేఖర్, బత్తుల రాజేశ్, మునుకుంట్ల రాజశేఖర్, మహిళలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



కమలాపూర్ : అంబాల గ్రామంలోని గోల్కొండ సమ్మక్కకు చెందిన హర్యానా ముర్రా జాతికి చెందిన పాడి గేదె శుక్రవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పాడి గేదెను నేరెళ్లకు వెళ్లే మార్గంలో మేతకు తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్కడ పచ్చిక మేస్తుండగా రాత్రి సమయంలో కురిసిన గాలి వానకు ఓ విద్యుత్ తీగ తెగిపడిందని, అక్కడే పచ్చిక మేస్తున్న పాడి పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పాడి గేదె విలువ సుమారు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుందని బాధితురాలు వాపోయింది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకుంటోంది.

గీత కార్మికుడికి గాయాలు

పర్వతగిరి : మండలంలోని జమలాపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు దుడ్డు సంపత్ శనివారం తాటిచెట్టు మీద నుంచి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. కులవృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కిన ఆయన ప్రమాదవశాత్తు జారి పడిపోగా కాలు, నడుము విరిగాయి. ఆయన్ను గీత కార్మికులు, కుటుంబీకులు వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు. సంపత్‌కు ప్రభుత్వమే వైద్యం చేయించడంతోపాటు బాధిత కుటుంబానికి సాయం అందించి ఆదుకోవాలని స్థానిక గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు బాల్య మల్లేషం, తెలంగాణ గౌడ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాల్య వెంకట్‌రాజ్, తదతరులు కోరారు.

సన్మానం

నర్సంపేట : నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన సీఐ రఘుపతిరెడ్డి స్థానిక వేమనరెడ్డి సంఘం నాయకులు శాలువాతో శనివారం సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చింతల కమలాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జవాన్‌కు..

పర్వతగిరి : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొని సెలవుల సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన మండలంలోని దూప తండాకు చెందిన భానోతు మోహన్‌ను ఆయన నివాసంలో మాజీ సర్పంచ్ ధరంసోత్ జాంరి, స్థానిక నాయకులు శనివారం శాలువాతో సన్మానించారు. సెలవుల్లో ఉన్న సమయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వెంటనే విధుల్లో చేరి యుద్ధ అనంతరం సెలవుల్లో ఇంటికి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పరామర్శ

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ షబ్బీర్ పాషాను అతడి తండ్రి షేక్ నూరొద్దీన్ ఇటీవల మృతి చెందిన క్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ భానోతు సింగ్‌లాల్ శనివారం పరామర్శించారు.

‘ఉపాధి హామీ’లో షెడ్ల నిర్మాణం

- పశువులు, పౌల్ట్రీఫామ్‌కు ప్రాధాన్యం
- ఒక్కో షెడ్డుకు రూ. 85 వేలు
- ఈజీఎస్‌లో పూర్తి సబ్సిడీతో నిర్మాణాలు
- బిల్లులు చెల్లించాలని లబ్ధిదారుల వేడుకోలు



వేలేరులో ఓ రైతు నిర్మించుకున్న పౌల్ట్రీ ఫామ్ షెడ్డు

వేలేరు : పశువులకు ఎండ, చలి, వర్షాల నుంచి రక్షణ కల్పించేందుకు, కోళ్ల పరిశ్రమను ప్రోత్సహించేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పశువుల షెడ్ల నిర్మాణాలు పాడి రైతులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిఉన్న సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరంలో 24 షెడ్లను మంజూరు చేసింది. మండలంలోని వివిధ గ్రామాల్లో 24 మంది రైతులు పశువుల షెడ్లను, ఇద్దరు రైతులు పౌల్ట్రీఫామ్ షెడ్లకు పనులు ప్రారంభించారు. పనులు కూడా దాదాపు పూర్తి కావచ్చాయి.

దరఖాస్తు చేసుకునే విధానం..

పశువుల షెడ్డు, కోళ్లఫామ్ షెడ్డు నిర్మాణానికి మొదటగా జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, గ్రామపంచాయతీ తీర్మాణం, సంబంధిత పశు వైద్యాధికారి నుంచి పశువులు, కోళ్లు ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. తహసీల్దార్ కార్యాలయంలో సన్న, చిన్నకారు రైతు ధ్రువీకరణ పత్రం పొంది మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలి. సంబంధిత అధికారి దరఖాస్తును పరిశీలించి పశువుల షెడ్డును మంజురు చేస్తారు.



కమ్మరిపేటలో నిర్మిస్తున్న పశువుల షెడ్డు

రూ.85వేలు మంజూరు..

రైతులకు ప్రయోజనకరంగా ఉండేందుకు వివిధ రకాల్లో షెడ్ల నిర్మాణానికి అవకాశం కల్పిస్తున్నారు. పాడి పశువుల పెడ్డుకు 14 ఫీట్ల పొడవు, 12 ఫీట్ల వెడల్పు గల షెడ్డు నిర్మాణానికి రూ.85 వేలు, 1000 కోడి పిల్లల షెడ్డు నిర్మాణానికి రూ.2.95 లక్షలతో 50 ఫీట్ల పొడవు, 16 ఫీట్ల వెడల్పుతో నిర్మించనున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారమే షెడ్డు నిర్మాణాలు చేపట్టినట్లు రైతులు తెలిపారు. పశువుల షెడ్లు, కోళ్ల ఫామ్ మంజూరుపై పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతుందని వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

పౌల్ట్రీ ఫామ్ నిర్మించుకున్నాం



ఉపాధి హామీ పథకంలో పౌల్ట్రీ ఫామ్ నిర్మించుకున్నాం. ఉపాధి హామీ పథకంలో దరఖాస్తు చేసుకోవడంతో అధికారులు పొలం వద్దకు వచ్చి పౌల్ట్రీ ఫామ్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించి 2.95 లక్షలతో 1000 కోళ్ల సామర్థ్యంతో పౌల్ట్రీ షెడ్డును మంజురు చేశారు. నిర్మాణం కూడా పూర్తి కావొచ్చింది.

\- సూత్రపు రమేశ్, రైతు, వేలేరు

ఉపయోగకరంగా ఉంది



మాకు పాడి పశువులు, గేదేలు ఉన్నాయి. ఉపాధి హామీ పథకంలో పశువుల షెడ్డు కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరైంది. అధికారులు సూచించిన కొలతల ప్రకారం షెడ్డు నిర్మించుకున్నాం. షెడ్డు నిర్మాణం పూర్తయినా డబ్బులు ఇంకా రాలేదు. డబ్బులు త్వరగా అందించాలి.

\- జుర్రు సంపత్, రైతు, వేలేరు

గ్రామాల్లో షెడ్ల నిర్మాణాలు..

- పీచరలో 08 పశువుల షెడ్లు
- వేలేరు 05 పశువుల షెడ్లు, 02 పౌల్ట్రీ షెడ్లు
- ఎర్రబెల్లి–02
- గుండ్లసాగర్–02
- కమ్మరిపేట–02
- కన్నారం–02
- మద్దెలగూడెం,–01, శాలపల్లి –02

పంట మార్పిడితో తెగుళ్ల నివారణ



మాట్లాడుతున్న డాక్టర్ సాయికిరణ్

శాయంపేట : పంట మార్పిడితో తెగుళ్లను నివారించవచ్చని కేవీకే మామునూర్ వెటర్నరీ సైంటిస్టులు డాక్టర్ జె.సాయికిరణ్, డాక్టర్ ఎం.సురేష్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా వికసిత కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగబడులు వస్తాయని అన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం, కోళ్ల పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా వాటి ఎరువులతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. రసాయనాల వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. సమీకృత వ్యవసాయ విధానం పాటించినట్లయితే సంవత్సరం పొడువునా ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. డ్రిప్పు పద్ధతిలో నీటి యాజమాన్య పద్ధతి పాటించినట్లయితే నీటి వృధాని అరికట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్ రీసెర్చ్ హైదరాబాద్ సాయిచంద్, ఏఓ గంగాజమున, రైతులు పాల్గొన్నారు.

3 నుంచి ‘భూ భారతిపై’ సదస్సులు

శాయంపేట : ఈనెల 3 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంపై మండలంలోని ప్రతీ రెవెన్యూ గ్రామంలో రోజువారిగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కల్వల సత్యనారాయణ శనివారం తెలిపారు. జూన్ 3న పత్తిపాక, 4న హుస్సేన్‌పల్లి, 5న నేరేడుపల్లి, 6న కాట్రపల్లి, 9న వసంతాపూర్, 10న పెద్దకోడెపాక, 11న గట్లకానిపర్తి, 12న మైలారం, 13న కొత్తగట్టు సింగారం, 16న తహరాపూర్, 17న కొప్పుల, 18న ప్రగతి సింగారం, 19న శాయంపేట గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సదస్సు కొనసాగుతాయని, భూ సమస్యపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్



ఎల్కతుర్తి : మాణిక్యాపూర్‌లో ఫర్టిలైజర్ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు



వేలేరు : విత్తనాల షాపులో తనిఖీలు చేపట్టిన టాస్క్‌ఫోర్స్ అధికారులు



ఆత్మకూరు : ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ యాదగిరి, సీఐ సంతోశ్

సీఐ రమేశ్, ఎస్సై దివ్య

ఎల్కతుర్తి : ఫర్టిలైజర్ షాపు దుకాణదారులు రైతులకు నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేసి పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్సై దివ్య హెచ్చరించారు. భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామంలో ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ షాపులను వంగర పోలీసులు వ్యవసాయ మండల అధికారి పద్మతో కలిసి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫర్టిలైజర్స్ దుకాణాల్లోని రికార్డులు, రసీదు బుక్కులను, విత్తనాలు, ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైన నాసిరకం, కాలం చెల్లిన విత్తనాలను రైతులకు అంటగట్టినట్లు తెలిస్తే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాల స్టాక్‌కు సంబంధించిన ధరల పట్టిక ప్రతీరోజు రైతులకు కనిపించే విధంగా ప్రదర్శింపజేయాలని అన్నారు. రైతులు సైతం విత్తనాలు కొనుగోలు చేసిన రసీదులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. ట్రైనీ ఎస్సై హేమలతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సాయిరామ్ రైతు డిపో సీడ్స్, ఫర్టిలైజర్ షాపులో సీఐ పులి రమేశ్ వ్యవసాయశాఖ అధికారులతో కలిసి శనివారం ఆసక్మికంగా తనిఖీ చేపట్టారు. విత్తన నిల్వను పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ.. నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజ్‌కుమార్, ఏఈఓ పున్నం చందర్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వేలేరు : ఫర్టిలైజర్ షాపు యజమానులు రైతులకు విత్తనాలు, ఎరువులను అధిక ధరలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ ఏడీఏ రాజ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఉన్న ఎరువులు, విత్తనాల షాపుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీలర్ల లైసెన్స్‌లు, విత్తనాల ప్యాకెట్‌ల లేబుల్స్, స్టాక్ రిజిస్టార్, బిల్ బుక్‌లను పరిశీలించారు. కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఓ కవిత, టాస్క్‌ఫోర్స్ ఏఓ సంతోశ్, ఎస్సై సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు గుడెప్పాడ్ గ్రామంలో ఎరువుల దుకాణాలను శనివారం ఏఓ యాదగిరి, సీఐ సంతోశ్ తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, రసీదు బుక్కులను పరిశీలించారు. దుకాణాల యజమానులు రైతులకు రసీదు ఇవ్వాలని అన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

సమస్యల పరిష్కారానికి 3న ధర్నా



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కృష్ణారెడ్డి, నాయకులు

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

దుగ్గొండి : రైతుల సమస్యల పరిష్కార దిశగా ఈనెల 3న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి తెలిపారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను మండలంలోని గిర్నిబావిలో శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రైతుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి తదనంతరం రూ.12 వేల తగ్గిస్తూ ప్రకటించిందని, ఖరీఫ్‌లో సాయం అందించకుండా రబీలో అరకొరగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని చెప్పారు. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకునేలా రైతులకు రైతు భరోసా డబ్బులు ఉపయోగపడేవని తెలిపారు.

ఒకేసారి మూడు నెలల బియ్యం



నల్లబెల్లి : రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు ఈనెలలో ఒకేసారి మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ముప్పు కృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్, జూలై, ఆగస్ట్ నెలలకు సంబంధించి ఒక్కో లబ్ధిదారుకు 18 కేజీలు చొప్పున బియ్యం అందించే దిశగా ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. మండలంలోని డీలర్లకు బియ్యం పంపిణీ చేయడానికి ఎంఎల్ఎస్ పాయింట్లలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. డీలర్లు లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

అవతరణ దినోత్సవానికి ఏర్పాట్లు

- స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి

పరకాల : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో జూన్ 2న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ ఆవరణాన్ని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, అధికారులు శనివారం పరిశీలించారు. అవతరణ దినోత్సవంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు, రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ను అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదే విధంగా ఇప్పటికే అమలు అవుతున్న సన్నం బియ్యం పంపిణీ, సన్నాలకు బోనస్ రూ.500, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రూ.200 యూనిట్ల ఉచిత విద్యుత్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్ఓసీ వివరాలతో కూడిన ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, నాయకులు రామకృష్ణ, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, అధికారులు

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో ఉపాధి

హనుమకొండ (దామెర) : స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. దామెర మండలంలోని ల్యాదెళ్లలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో మహిళల్లో నైపుణ్యం మెరుగుపడుతుందన్నారు. ఉద్యోగవకాశాలు పెరగడం వలన ఆర్థిక ప్రగతి సాధించవచ్చన్నారు. దామెరలో డైరీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగుల భవిష్యత్‌పై ప్రభుత్వం ఆలోచిస్తుందని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు శ్రమిస్తోందని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- సివిల్ ఆస్పత్రి ఆర్ఎంఓ బాలకృష్ణ

పరకాల : యోగా చేయడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలు దూరమవుతాయని సివిల్ ఆసుపత్రి ఆర్ఎంఓ బాలకృష్ణ అన్నారు. ఈనెల21వ తేదీన యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సివిల్ ఆస్పత్రి ఆవరణలో ఆయుష్ విభాగం యోగా ఇన్‌స్ట్రక్టర్స్ భోగ రఘుపతి, అమూల్యతో కలిసి ఉద్యోగులకు, సిబ్బందికి యోగా చేయడం కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భోజనంతో పాటు మనిషి ఆరోగ్యం చాలా ముఖ్యమనే విషయాన్ని గమనించి ప్రతిరోజు గంటపాటు యోగా కోసం కేటాయించాలని సూచించారు. దీంతో అనేక అనారోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. వైద్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



యోగాపై అవగాహన కల్పిస్తున్న ఆర్ఎంఓ బాలకృష్ణ

రజతోత్సవాలకు తరలిన జర్నలిస్టులు



టీజేఎఫ్ రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జర్నలిస్టులు

కమలాపూర్ : తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎఫ్) ఏర్పడి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లోని జల విహార్‌లో శనివారం నిర్వహించిన రజతోత్సవ వేడుకలకు కమలాపూర్ మండలం నుంచి పలువురు టీజేఎఫ్ ప్రతినిధులు, జర్నలిస్టులు తరలివెళ్లారు. తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జర్నలిస్టులు టీజేఎఫ్ రజతోత్సవ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించి హైదరాబాద్‌కు బయలుదేరారు. పబ్బు సతీశ్‌గౌడ్, బాలసాని దేవేందర్‌గౌడ్, తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, కూనూరు రంజిత్‌గౌడ్, ఒస్కుల డేవిడ్, ఇజ్జిగిరి సంపత్‌కుమార్, మోడెం రాజ్‌కుమార్‌గౌడ్, కనుకుంట్ల శ్రీనివాస్, దాసిరి రవి, కుసుంబ శివాజీ, కొలుగూరి రాజ్‌కుమార్, మాట్ల మహేశ్వర్, పుల్ల తరుణ్‌తో పాటు తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

ఎల్కతుర్తి : రాష్ట్రంలోని పేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం అండగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శీలం అనిల్‌కుమార్ అన్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రానికి రూ.5.12 లక్షలు విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు కాగా శనివారం పార్టీ నాయకులతో కలిసి ఆయన లబ్ధిదారులకు అందించారు. లబ్ధిదారులు పెరుకు మధుసుధన్, జనగాం రాజు, బొంకూరి లత, కొత్తకొండ విజయ, జనగానీ చైతన్య, వల్లాల జయ, బండారి లక్ష్మికి అందించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. పేదప్రజల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. నిరుపేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు వివరించి అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, నాయకులు రమేశ్, చారి, సురేందర్, వినయ్‌గౌడ్, ప్రదీప్, జగన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధూమపానం ఆరోగ్యానికి హానికరం

- వైద్యులు రుబీనా, రహమాన్
- ర్యాలీ నిర్వహించిన వైద్య సిబ్బంది

ఎల్కతుర్తి : ధూమపానం ఆరోగ్యానికి హానికరమని, బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని వంగర పీహెచ్‌సీ వైద్యులు రుబీనా, రహమాన్ ఎస్సై దివ్య స్పష్టం చేశారు. ప్రపంచ ధూమపాన నిషేధ దినోత్సవాన్ని వంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధూమపానంతో వచ్చే అనర్థాలను వివరించారు. ధూమపానంతో ఊపిరితిత్తుల వ్యాధులు రావడంతో పాటు కెన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. యువకులు, ప్రజలు ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై హేమలత, ఏఎస్సై సంపత్, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

రాజ్యలక్ష్మికి నివాళి

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన రామిని రాజ్యలక్ష్మి శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందుపట్ల సత్యపాల్‌రెడ్డి శనివారం రాజ్యలక్ష్మి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాయరాకుల మొగిలి, నాయకులు మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, రాకేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రాయపర్తి : హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తొర్రూరులో నేడు (ఆదివారం) నిర్వహించనున్న ఉచిత వైద్యశిబిరాన్ని పేదలు వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.